కథ

# గాడ్ ఈజ్ గ్రేట్

చెమ్మగిల్లుతున్న కళ్లతో ఆ ఉత్తరాన్ని ఎన్నిమార్లు చదివేనో నాకే తెలీదు. మళ్లీ మళ్లీ చదివాను. చదివేక కళ్లనుంచి రాలే కన్నీటి బిందువులతో తడిచిన చెక్కిళ్ళు అదురుతుంటే మళ్లీ చదివాను. ఎంత చదివినా మళ్లీ చదవాలనిపించి మళ్లీ చదివాను. చదివాక తెలుస్తోంది అసలా ఉత్తరం చూసి నేను చదువుతున్నానా లేక మరేదో బాధ కలిగించే విషయం గురించి ఆలోచిస్తూ ఉత్తరాన్ని చదువుతున్నట్లు ఫీలవుతున్నానా?

ఏమో...నాకే తెలియడంలేదు. తెలిసిందల్లా ఒక్కటే- ఆ ఉత్తరం, అందులో శైలజ వ్రాసిన విషయం. ఉత్తరం చివర్లో శైలజ వ్రాసిన ఆఖరు పేరాలోని అక్షరాలు నా గుండెల్ని ముక్కలు ముక్కలు చేసాయి.

''...మరణానికి నేనేం బాధ పడలేదు విజయా! కానీ మరణిస్తున్నానని అనుకుంటున్న సమయంలో నా ఎదురుగా నించున్న నా భర్త అనబడే ఆ దుర్మార్గుడి కళ్లల్లో నీళ్ళు తిరగడం చూసి నా గుండెలు మండిపోయాయి. అసలా సమయంలో నువ్వు నా దగ్గరే వుంటే ఎంతో బావుణ్ను. ఏం జరిగిందో చెప్పేదాన్ని. నీరసంగా వున్న నాకు బలం కోసం టానిక్కు అంటూ నిద్రపోతున్న నన్ను లేపి బలవంతంగా త్రాగించిన విషం నా గుండెల్ని మండించి రక్తాన్ని కక్కించి చావుకి సమీపంలోకి లాక్కెళ్లిందని చెప్పనా? నేను చనిపోతే మరొకతెను పెళ్లి చేసుకుని సుఖపడాలని నా చావుకోసం తెగించేడని వ్రాయనా? కానీ నా ఆశ ఆశగానే మిగిలిపోయింది. నా నోరు పెగలక, మాట రాక అల్లల్లాడుతున్నప్పుడు నాపైన జాలి చూపిస్తూ నేనే త్రాగి చావాలని ప్రయత్నించానని ఏవేవో కట్టుకథల్ని డాక్టర్లకు చెప్తుంటే అమాంతం లేచి వాడి పీక పిసికి చంపెయ్యాలనిపించింది. కానీ ఏమీ చేయలేకపోయాను. ఇవాళో రేపో అన్నట్లుగా వున్నా ఓపిక చేసుకుని నీకీ ఉత్తరం రాస్తున్నాను. నా కోసం కన్నీరు కార్చేందుకు ఎవరున్నారని? కనీసం నువ్వయినా ఓ కన్నీటి బొట్టు నాకోసం రాలిస్తే ఆ లోకంలో వుండే నాకు అదే ఆత్మశాంతినిస్తుంది.''

నీ

శైలజ.

శైలజ మరణానికి ఏడవకుండా ఉండాలని నేననుకోవడంలేదు. కానీ అది సహజ మరణంకాదు. హత్య. భర్త అనబడే ఒక విషకీటకం చేసిన హత్య.

నా దృష్టిలో శైలజ ఒక అద్భుతమైన స్త్రీమూర్తి, ఒక మంచి మనసున్న గొప్ప స్నేహితురాలు.

గొప్ప గొప్ప వాళ్లు కూడా ఏదో ఒకనాటికి మరణించాల్సిందే. ఆ గొప్పవాళ్ళ గొప్పతనాన్ని వారి మరణం ఎన్నటికీ తగ్గించదు. తగ్గించలేదు. ఉత్తరం మడిచి సోఫామీద పడేసాను.

శైలజ గురించిన ఆలోచనలు ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టాయి.

★★★

శైలజా, నేను చిన్నప్పటినుంచీ స్నేహితురాళ్ళం. ఒకే ఊళ్ళో పుట్టి పెరగడమే కాదు, ఒకే స్కూల్లో కలిసి చదువుకున్నాం. మొదటినుంచీ శైలజది ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం. నెమ్మదస్తురాలు. పెద్దలంటే ఎనలేని గౌరవం. ఆమె ఆలోచనలూ, నా ఆలోచనలూ ఎన్నడూ కలిసేవి కావు. అలాగని మేమెన్నడూ కలహించుకోలేదు. మేమిద్దరం మంచి స్నేహితురాళ్ళం. మా స్నేహం విలువ మాకే తెలుసును.

అందరూ అందరితో కాకున్నా కొందరితో స్నేహం చేయడం జరుగుతుంది. కొందరికి కొద్దిమందే స్నేహితులుంటే మరికొందరికి ఎక్కువమంది స్నేహితులుంటారు. ఏదేమైనా వారి స్నేహంలో వారనుభవించే ఆనందం చాలా గొప్పది.

చిన్న చిన్న విషయాల్లో శైలజకూ, నాకూ అభిప్రాయాల్లో భేదాలున్నా వాటన్నింటికన్నా మామధ్య ఆత్మీయతపాలు ఎక్కువ. అందుకే శైలజను అభిమానించేదాన్ని. ప్రేమించేదాన్ని.

శైలజ పెళ్ళయిన కొత్తలో భర్తతో కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి నాకు పంపింది. చూడగానే జంట బావుందనిపించింది. మనిషి బాహ్యరూపం అంతరంగానికి అద్దం కానేకాదు. అంతరంగంలో కాలకూట విషం దాచుకున్న మనుషులు ముఖాలు బాహ్యానికి ఎంతో అందగాళ్ళుగా కనిపించడం అప్పుడప్పుడు జరుగుతుంది.

శైలజ భర్తతో కలిసి తీయించుకున్న ఆ ఫోటోను మావారు డా. ప్రభాకర్ చూసేరోసారి. ఆశ్చర్యపోయారు.

''వీడా? వీడి ఫోటో నీకెలా వచ్చింది?'' ప్రశ్నించారు.

''ఇతను మీకు తెలుసా?'' తిరిగి ప్రశ్నించానాయన్ని.

''వీడిని తెలీకపోవడమేమిటి? నేను రాజమండ్రిలో ప్రాక్టీసు చేస్తున్నప్పుడు వీడిని బాగా ఎరుగుదును. ఓసారి నా దగ్గరకు వచ్చాడు. వీడి వెనుక ఓ అందమైన స్త్రీ కూడా వుంది. ఆవిడ నాలుగు నెలల గర్భవతి కూడా. ఆమెకు ఒంట్లో బాగులేదని ట్రీట్‌మెంట్ చేయమని తీసుకువచ్చాడు. తన భార్య అని చెప్పడం కూడా గుర్తు. ఆమెకు నాలుగైదుసార్లు వైద్యం చేసాను. ఇంతకీ ఈ ఫోటో నీకెలా?''

ప్రభాకర్ ప్రశ్న పూర్తి కాకుండానే అందుకున్నాను.

''శైలజకు పెళ్ళయింది కదా! ఇతనే ఆమె భర్త.''

ఆశ్చర్యంగా నమ్మలేనట్లుగా చూసేరు ప్రభాకర్ నావంక.

''ఎక్కడో పొరపాటు జరిగిపోయింది విజయా! మీ స్నేహితురాలు శైలజ... పాపం మోసపోయిందనుకుంటాను. ఇప్పుడెలా?'' ఆందోళనగా పలికిందాయన గొంతు.

''ఇప్పుడు చేయగలిగిందేమీలేదండీ. తన భర్తను గురించిన ఈ నిజం శైలజకు తెలిస్తే ఆమె గుండె బ్రద్దలైపోతుంది. ఇది మనలోనే వుండిపోవాలి. ఏదో రోజు అతని గుట్టు బట్టబయలు చేద్దాం. ఈలోగా శైలజ దాంపత్యం ఎలా వెళుతోందో మనం గమనించక తప్పదు'' అన్నాను సాలోచనగా.


నా మాటలకు అలాగేనంటూ తలూపారు ప్రభాకర్.

★★★

ఆలోచనల నుంచి బయటపడేసరికి బాగా చీకటి పడిపోయింది.

''లైట్లు వెలిగించుకోకుండా చీకట్లోనే అలా సోఫాలోనే ఉండిపోయావేం విజయా? ఏం జరిగింది?''

**శైలజ పెళ్ళయిన కొత్తలో భర్తతో కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి నాకు పంపింది. చూడగానే జంట బావుందనిపించింది. మనిషి బాహ్యరూపం అంతరంగానికి అద్దం కానేకాదు. అంతరంగంలో కాలకూట విషం దాచుకున్న మనుషులు ముఖాలు బాహ్యానికి ఎంతో అందగాళ్ళుగా కనిపించడం అప్పుడప్పుడు జరుగుతుంది.**



హాల్లో లైట్లు వేస్తూ లోపలకు వచ్చిన ప్రభాకర్ ప్రశ్నించేసరికి అంతవరకూ బిగపట్టుకు కూర్చున్న నాలోని దుఃఖం ఒక్కసారిగా పైకుబికింది.

ఆయన భుజంపైన వాలిపోయాను కన్నీళ్ల పర్యం తమవుతూ...''ఛ...ఛ ఊరుకో విజయా. ఎన్ని అడ్డం కులు ఎదురైనా చలించని గుండె నిబ్బరంగల నువ్వే ఇలా వుంటే ఎలా? అసలేం జరిగిందో చెప్పు?''

అనునయంగా అడిగారాయన. సోఫాలో పడేసిన శైలజ వ్రాసిన ఉత్తరాన్ని చూపించాను. అది అందుకున్నారు.

ఆ ఉత్తరాన్ని చదువుతున్నంతసేపూ ఆయనలో కలుగుతున్న భావప్రకంపనలు గమనిస్తూనే వున్నాను. చివరిదాకా చదివాక అన్నారు.

''ఇక ఊరుకుంటే లాభం లేదు విజయా. మనమోసారి అక్కడికి వెళ్దాం. మీ శైలజ భర్తనోసారి కలుద్దాం'' అన్నారు ప్రభాకర్.

ఆయన చెప్పింది బాగానే వుంది. కానీ చిన్న సందేహం కలిగింది నాలో.

''వెళ్దాం సరే. అక్కడికెళ్లాక ఏం చేద్దామని. మీ మనస్సులోని ఆలోచనలేమిటో చెప్పండి ముందు. ఆ ప్రకారం నడుచుకోవాలికదా'' అన్నాను.

''బహుశా వాడు నన్ను చూసాక తప్పించుకోలేక పోవచ్చు. వాడి గురించిన నిజం కాస్తో కూస్తో తెలిసిన వాడిని కాబట్టి నా ప్రశ్నల నుంచి నా నుంచి తప్పించుకోలేడు... మనుషులు తప్పులు చేస్తారు. కానీ ఆ తప్పులు ఒప్పుకున్ననాడే క్షమించబడతారు. అడ్డంగా తిరగబడి బుకాయిస్తే తమ పీకలమీదకి తెచ్చుకుంటారు. పద!'' అంటూ లేచారు ప్రభాకర్.

యం. ఉమామహేశ్వరరావు

శైలజ ఉత్తరం కలిగించిన బాధలోంచి విముక్తురాల్ని కాలేదుగానీ ప్రభాకర్ ఆలోచన నన్ను కర్తవ్యం వేపు కదిలేలా చేసింది. కన్నీరు తుడుచుకున్నాను.

''శైలూ! నీ మరణానికి తగిన మూల్యం అనుభ

వించేదాకా ఆ రాక్షసుడ్ని విడిచిపెట్టను.''

నా మనసులో గట్టిగా అనుకోవడం ప్రభాకర్‌కు వినిపించింది. నావైపు చూసారు. ఆ చూపు కొండంత ధైర్యాన్నిస్తోంది నాకు.

★★★

తలుపు తెరిచి ఎదురుగా నించున్న ఆ వ్యక్తిని చూడగానే నా గుండెలాగిపోయాయి. ప్రభాకర్ అయితే మరీనూ. అవాక్కయిపోయారు. మేం చూస్తున్నది కలా? నిజమా అన్పించిందో క్షణం. క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి.

మమ్మల్ని గుర్తించిందా వ్యక్తి.

ఆ వ్యక్తి శైలజ.

''విజయా! నువ్వా?'' ఎంతో ఆప్యాయతగా దగ్గరకు వచ్చింది శైలజ. ఆశ్చర్యమో, ఆనందమో తెలీని సంధిగ్ధావస్థలో వుండిపోయాను. క్షణం ఆగి ''లోపలకు రండి'' అంటూ లోపలకు తీసుకువెళ్లింది మమ్మల్ని.

ఆశ్చర్యం మమ్మల్నింకా విడచిపెట్టలేదు. నిశ్శబ్దంగా కూచున్నాం. మరణించిందనుకున్న శైలజ బ్రతికెలా వచ్చిందో అర్థం కాలేదు.

మన మనస్సుల్లో ముందుగానే చోటు చేసుకున్న భావనకు విరుద్ధంగా కళ్లెదుట కనిపిస్తుంటే ఏం చేయాలో బోధపళ్ళేదు.

శైలజ మాతోపాటు తనూ కూర్చుంది. ఆమెలో ఎంతో మార్పు కనిపిస్తోంది. మా అంతరంగాల్లో కదలాడే సందేహాలను గమనించింది శైలజ.

''నేను బ్రతికేవున్నానని తెలిసి మీరాశ్చర్యపోతున్నారు కదూ విజయా? చనిపోయేముందు నీకు నేను వ్రాసిన ఉత్తరంలోని విషయాలూ, చావుకు అత్యంత సమీపంలోకి వెళ్లడం కూడా యదార్థమే. నా జీవితంలో రెండో అధ్యాయం ఇప్పుడే ప్రారంభమైంది'' అంటూ ఆగింది శైలజ. ప్రభాకర్, నేనూ, ఒకరి ముఖాలొకళ్ళు చూసుకున్నాం.

''మరణిస్తున్న నన్ను మళ్లీ జీవం పోసి బ్రతికించారు. కొన్ని సంవత్సరాలుగా బాధపడే అలవాటుకు బానిసైన నేను ఇప్పుడా బాధనుంచి విముక్తి చెందాను. బానిసత్వ భావన నుంచి బయటపడి మామూలు మానసిక స్థితిలో జీవిస్తున్నాను. కేవలం భార్యాభర్తలమే తప్ప చాలా కాలం నుంచి నా భర్తకూ, నాకూ ఏ అనుబంధమూ లేదు. ఏ సుఖాలనూ మేము అనుభవించలేదు. వాడు పెట్టే బాధల్ని నిశ్శబ్దంగా అనుభవిస్తూ వచ్చేనే తప్ప వాడితో ఎన్నడూ కలసి కాపురం చేసింది లేదంటే ఎవ్వరూ నమ్మరు.''

ఆగి మా ఇద్దరి వంకా చూసింది శైలజ. మళ్లీ అంది.

''నా మాటలు మీరు నమ్ముతున్నారన్న విశ్వాసంతోనే మీకిదంతా చెప్తున్నాను.''

విసుగ్గా వుంది నాకు. అయినా విసుగును పైకి కనిపించనీయకుండా అడిగాను.

''అసలేం జరిగిందో చెప్పు? నీ ఉనికిని చూస్తూ మా కళ్లను మేమే నమ్మలేక నిజంగా మేమిప్పుడు చస్తున్నట్లుగా వున్నాం.''

నా మాటలకు చిన్నగా నవ్వింది శైలజ. అంతలోనే ఆమె ముఖంలో దిగులు, బాధ ఛాయలుగా గోచరించాయి. ఆమె కనుకొలనుల నుంచి కన్నీరు ఉబికి బుగ్గలపై నుంచి జారసాగింది.

''చావబోతున్న నన్ను రక్షించాలన్న తాపత్రయం డాక్టర్లకైతే కలిగిందిగానీ నా భర్తలో కలగలేదు. బాధ నటిస్తూ డాక్టర్ల దగ్గర సింపతీ సంపాదించాలని ప్రయత్నించి చివరకు...'' ఆగింది శైలజ. నిశ్శబ్దంగా వింటున్నాం.

''నేను బ్రతికిబట్టకట్టడానికి సరిపడా రక్తం నా ఒంట్లోలేదని, రక్తం కావాలని అతన్ని అడిగిన డాక్టర్లకు తన రక్తం పూర్తిగా తీసుకునయినా నా ప్రాణాలు కాపాడమంటూ డాక్టర్ల చేతులు పట్టుకున్న అతని త్యాగం చూసి డాక్టర్లకే మతులు పోయాయి. సరేనంటూ అతని రక్తం తీయడానికి సిద్ధమైనారు...'' ఆగింది శైలజ. ఆయాసంతో ఆమె హృదయం ఎగిసెగసి పడుతోంది.

''చాలా బాగుందతని వరుస. చావుదెబ్బలు కొట్టి ఆనక గాయాలకు మందు రాసేట్ట వెనకటికెవడో. అలా వుంది'' అన్నాడు ప్రభాకర్. నవ్వొచ్చింది నాకు.

''ఏదేమైనా నీ భర్త తన రక్తం ధారపోసి నిన్ను మరలా బ్రతికించుకున్నాడన్నమాట. ఎంతయినా ఇల్లాలివి కదా. ఆ మాత్రం ప్రేమ అతన్లో వుండే వుంటుంది'' అన్నాను. నా మాటలకు బేలగా నావంక చూసింది శైలజ.

తుపాను అనంతరం తెల్లటి ఎండతో నిండిన నీలాకాశంలా కనిపిస్తున్నదా సమయంలో. తుపాను రేపిన నష్టాన్ని మరిచిన మనిషిలా నిర్లిప్తంగా గోచరిస్తోంది. ఆమె హృదయంలోంచి ఏదో రాగం ఇంకా నిశ్శబ్దంగా ధ్వనిస్తున్నట్లు వినిపిస్తోంది నాకు.

మళ్లీ శైలజే గొంతు విప్పింది.

''ఒక భయంకరమైన నిజాన్ని ఇప్పుడు చెబుతున్నాను విజయా. అణువణువులోనూ దుర్మార్గం తప్ప జాలి, దయ, కరుణ అనేవి ఏ కోశానా లేని ఆ వ్యక్తి రక్తం నాకు ఎక్కించడానికి వీల్లేదన్నారు డాక్టర్లు. ఆ రక్తం నాలో ప్రవేశిస్తే నాకు చావు తప్పదన్నారు. మన ఒంట్లోని రక్తం చాలనప్పుడు మన రక్తం గ్రూపుకే చెందిన వారి రక్తం ఎక్కించడంలో తప్పులేదు. కానీ నా భర్త రక్తం కలుషితం అయిపోయింది. అతని రక్తాన్ని పరీక్షించిన డాక్టర్లు ఒక నమ్మలేని నిజాన్ని గ్రహించి ఆశ్చర్యపోయారు. అవాక్కయిపోయారు. అతని రక్తం హెచ్‌ఐవీ పాజిటివ్ చూపించింది. అంటే అతనికి ఎయిడ్స్...''

నమ్మలేక ఆశ్చర్యంతో వున్న మా ముఖాలు చూసి మళ్లీ తనే అంది శైలజ.

''అవును విజయా. అతనికి ఎయిడ్స్ వ్యాధి సోకింది. అతను ఎయిడ్స్ రోగి అని తెలియగానే అతన్ని నా చుట్టుప్రక్కలేకాదు, అసలు ఆ హాస్పిటల్ ఆవరణలోనే వుండకుండా బయటకు తీసుకెళ్లి ఏదో చోట ఎవరికీ కన్పించకుండా ఉంచారని తెలిసింది. ఆ తరువాత ఎలాగో నా గ్రూపుకి సరిపోయే రక్తాన్ని డాక్టర్లే తెచ్చి నా శరీరంలోచేర్చి చావునుంచి నన్ను బ్రతికించారు.''

కన్నీళ్లతో శైలజ చెంపలు తడిచిపోయాయి.

''చావు అనేది ఒక్కసారిగా వచ్చి ప్రాణాలు పోతే ఎంతో బావుంటుంది. మరణాన్ని సహజ మరణమని, అసహజ మరణమని అంటారు. శైలజ భర్త అనబడే ఆ దుర్మార్గుడికి బ్రతుకిక క్షణక్షణం భయంతో బాధతో అల్లల్లాడవలసిందే. చూసేవాళ్ళు లేక ఒంటరితనంతో నికృష్టపు చావు చావవలసిందే.''

నా భావాలను, నా ఆవేశాన్ని గ్రహించారు ప్రభాకర్.

''మనం చేసిన, చేస్తున్న పాపకార్యాలకు ఫలితం ఎక్కడో, ఎప్పుడో పైలోకాలలో శిక్ష అనుభవిస్తాం అన్న మాట ఎంత యధార్థమో నాకు తెలీదు కానీ మన పాపాలకు మనం ఇక్కడే ఈ భూమ్మీదే శిక్షను తప్పక అనుభవిస్తాం. మీ భర్తనే ఆ రాక్షసుడికి తగిన శిక్షను ఆ భగవంతుడే విధించాడు శైలజ గారూ. గాడ్ ఈజ్ గ్రేట్!''

ప్రభాకర్ అన్న మాటలు ఎంతో సమంజసంగా, సందర్భోచితంగా అన్పించి కృతజ్ఞతాపూర్వకంగా చూసేనాయన్ని. నాతో పాటు శైలజ కూడా.

★

